క్లుప్తంగా

జిల్లా స్థాయి ఆటల పోటీలకు విద్యార్థుల ఎంపిక



చాట్రాయి: నూజివీడు నియోజకవర్గ స్థాయిలో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీల్లో మండలంలోని సిద్ధార్థ హైస్కూలు, ఉషోదయ హైస్కూలు విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. ఖోఖో, కబడ్డీ, త్రోబాల్, వాలీబాల్ పోటీల్లో జిల్లాస్థాయి ఆటల పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయా హైస్కూళ్ల ప్రిన్సిపాళ్లు దబ్బిగొడ్డల వెంకట్రామయ్య, పలగాని శ్రీనివాసరావు తదితరులు పీఈటీలు విజయ్, వెంకటేసు, విద్యార్థులను అభినందించారు.

రైతు కుటుంబానికి ఆర్థిక సాయం



నూజివీడు: మండలంలోని మీర్జాపురం సొసైటీ సభ్యులైన గొరిపర్తి లక్ష్మణస్వామి ఇటీవల మరణించగా కేడీసీసీబీ ఉత్తర్వుల ననుసరించి గొరిపర్తి లక్ష్మికి మీర్జాపురం సహకార సంఘం తరపున సంఘ అధ్యక్షుడు బడుగు రంగారావు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్ పర్సన్ తాతినేని పద్మావతి ఆదేశాల మేరకు ఈ ఆర్థిక సాయం అందజేసామన్నారు. కార్యక్రమంలో సీఈఓ నీలం నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు రవి, నాగరాజు, వలీ పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



లక్ష్మీపురం(తిరువూరురూరల్): మండలంలోని లక్ష్మీపురంలో ఇటీవల మరణించిన మద్దిరాల రత్నకుమారి అనే మహిళకు మంజూరైన వైఎస్సార్ బీమా నగదును ఆమె కుటుంబ సభ్యులకు శనివారం పంపిణీ చేశారు. లక్ష్మీపురం గ్రామ సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జీ శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యురాలు కోటేశ్వరి, పీఏసీఎస్ డైరెక్టర్ రమణ, సచివాలయ సిబ్బంది బీమా నగదును రత్నకుమారి కుటుంబసభ్యులకు అందజేశారు.

రేపటి నుంచి గణపతి నవరాత్రి ఉత్సవాలు

తిరువూరు: వినాయక చవితి సందర్భంగా పట్టణంలోని పలు కూడళ్లు, ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు భక్తబృందాలు ఏర్పాట్లు చేస్తున్నాయి. షిర్డీసాయి మందిరం, బైపాస్‌రోడ్ విఘ్నేశ్వరాలయం, ఇందిరాకాలనీ, చీరాల సెంటర్, బోస్ సెంటర్, బస్టాండు సెంటర్, జైబావి సెంటర్, గణేష్ సెంటర్, కృష్ణా టాకీస్ సెంటర్లలో నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు పందిళ్లు సిద్ధం చేస్తున్నారు. గణనాథుల మట్టి విగ్రహాలు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను విక్రయానికి పట్టణంలో అందుబాటులో ఉంచారు.

ప్లాస్టిక్ నిషేధంతో పర్యావరణ పరిరక్షణ



తిరువూరు: అధిక ఉష్ణోగ్రతల కారణంగా భూమిపై జీవుల ప్రాణాలకే ముప్పు ఏర్పడుతోందని, తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం పీఎస్ఎన్ రాజు అన్నారు. పాఠశాలలో ఓజోన్ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. వాతావరణ కాలుష్యం వలన ఓజోన్‌పొర దెబ్బ తినడంతో ఈ విపత్కర పరిస్థితి నెలకొందని, పచ్చదనం కరువవడం, ప్లాస్టిక్ వాడకం విపరీతంగా పెరగడం, పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యం ఓజోన్ పొరకు నష్టం కలిగించడంతో భవిష్యత్తులో భూమిపై జీవుల మనుగడ కష్టమవుతుందని పేర్కొన్నారు. ప్రతి ఇంటా మొక్కలు నాటాలని సూచించారు. విద్యార్థులు ఓజోన్ ఆకారంలో ప్రదర్శన జరిపారు.

స్కూల్ గేమ్స్ ప్రారంభం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి జెడ్పీ బాలికల పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. 14, 17 ఏళ్ల లోపు సుమారు 200మంది బాలికలకు ఖోఖో, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో గెలుపొందిన బాలికలు నియోజకవర్గ స్థాయిలో పాల్గొంటారని హెచ్ఎం పద్మలత తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే రక్షణనిధి



ఏ.కొండూరులో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

ఏ.కొండూరు: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమపథకాలు అందిస్తున్నామని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణ నిధి పేర్కొన్నారు. ఏ.కొండూరులో రూ.61.80 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామ సచివాలయ కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ సెంటర్లు ప్రజలకు ఉపయోగపడుతున్నాయన్నారు. గ్రామాల్లో ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు, సంక్షేమ పథకాల మంజూరు కోసం కార్యాలయాలు చుట్టూ తిరిగే పని లేకుండా గ్రామాల్లోనే సచివాలయాల్లో గ్రామ వలంటీర్ల ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేయిస్తున్నామన్నారు. నవరత్నాల్లో భాగంగా ఇచ్చిన హామీలు నూటికి నూరుశాతం అమలు చేసి చూపించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది గ్రామాల్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించి, వ్యాధులు సోకకుండా ప్రజలను అప్రమత్తం చేసే విధంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ మండలంలో డయాలసిస్ చేయించుకుంటున్న రోగులకు ప్రతినెలా రూ. 10వేలు, పక్షవాతం వచ్చిన వారికి రూ. 5వేలు చొప్పున పింఛన్లు అందిస్తున్నామన్నారు. కిడ్నీ వ్యాధి ప్రభావిత గ్రామాల్లో 50 ట్యాంకులు ఏర్పాటు చేసి ట్రాక్టర్ల ద్వారా కృష్ణాజలాలు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో రూ. 48 కోట్లతో కృష్ణాజలాలు ఇంటింటికీ కుళాయిల ద్వారా అందించేందుకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తున్నామని, త్వరలో పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామ సచివాలయలలో పరిధిలో రూ. 20 లక్షలు మంజూరు చేసి అభివృద్ధి పనులు ఉపయోగించాలని ప్రజా ప్రతినిధులకు, అధికారులకు సూచించామన్నారు. నియోజకవర్గస్థాయిలో రూ. 15కోట్లతో 77 గ్రామ సచివాలయాల నిర్మాణ పనులు పూర్తి చేశామని తెలిపారు. 12 గ్రామాలకు ఒక్కొక్క గ్రామానికి రూ. 5లక్షల చొప్పున రూ. 60 లక్షలతో రహదారులు వేసేందుకు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఏ.కొండూరులో రూ. 40 లక్షల వ్యయంతో గ్రామ సచివాలయం, రూ. 21.80 లక్షల వ్యయంతో రైతు భరోసా కేంద్రాన్ని నాణ్యతా ప్రమాణాలతో నిర్మించి, వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంపీపీ నాగలక్ష్మి, జెడ్పీటీసీ భూక్యగనియా, సర్పంచ్ రజిని, వైస్ ఎంపీపీలు శివారెడ్డి, పద్మ, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు టి సురేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు రాంబాబు, వెంకట్రావు, వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు అంజనేయులు, సతీష్, అమీన్, చెన్నారావు, నరసింహా రావు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ కే.వీ.ఎస్ రవికాంత్, పీఆర్ ఏఈ సాంబశివరావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలు మేలు

నూజివీడు: పర్యావరణ పరిరక్షణ కోసం వినాయకచవితి సందర్భంగా మట్టి విగ్రహాలను ఉపయోగించాలని నేషనల్ గ్రీన్‌కార్ప్స్ క్లస్టర్ కో-ఆర్డినేటర్ కాకిలేటి శ్యామ్‌బాబు అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్లో శనివారం గణేశ్ ఉత్సవాల సందర్భంగా మట్టి విగ్రహాల వాడకం వల్ల కలిగే ప్రయోజనాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడం వల్ల ఆ రసాయనాలు నీటిలో కలిసి నీరంతా కలుషితమవుతోందని, తద్వారా జీవరాసులకు హాని కలుగుతోందన్నారు. హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం వీణారాణి మాట్లాడుతూ మట్టి విగ్రహాల వల్ల ఎలాంటి హాని జరగదన్నారు. విద్యార్థులందరూ వినాయకచవితికి మట్టి విగ్రహాలనే ఉపయోగించాలన్నారు. అనంతరం విద్యార్థులకు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు.



నూజివీడులో వినాయకుడి మట్టి విగ్రహాలను అందజేస్తున్న హెచ్ఎం వీణారాణి

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

గంపలగూడెం: వినాయక చవితిని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆర్యవైశ్య సంఘం గంపలగూడెం మండలశాఖ ఆధ్వర్యంలో శనివారం 800 మట్టివినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. గంపలగూడెం బస్‌స్టాప్ సెంటర్ వద్ద పంపిణీని ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు చిన్న సత్యంబాబు ప్రారంభించారు. గంపలగూడెం, పెనుగొలను, ఊటుకూరు, నెమలి, గోసవీడు గ్రామాలలో పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు నాగరాజు, హనుమంతరావు, శ్రీకాంత్, కుమార్, నరసింహారావు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



గంపలగూడెంలో మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు

గానుగపాడులో..

గానుగపాడు(తిరువూరురూరల్): వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండలంలోని గానుగపాడులో జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు శనివారం మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. గ్రామంలో ఇంటింటికీ ప్రతిమలను పంపిణీ చేసి పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ప్రధానోపాధ్యాయురాలు ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిరువూరులో..

తిరువూరు: వినాయక చవితి ఉత్సవాల్లో రసాయనాలు, రంగులతో చేసిన విగ్రహాల కంటే మట్టి విగ్రహాలనే పూజించాలని తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. వినాయక చవితిని పర్యావరణ హితంగా నిర్వహించేందుకు సూచనలతో రూపొందించిన కరపత్రాలను ప్రధానోపాధ్యాయుడు పీఎస్ఎన్ రాజు, ఉపాధ్యాయులు ఆవిష్కరించారు.

19 నుంచి నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు

గంపలగూడెం: భారత పాఠశాలల సమాఖ్య ఆధ్వర్యంలో తిరువూరు నియోజకవర్గ స్థాయి క్రీడల పోటీలను గంపలగూడెంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి శనివారం విలేకరులకు తెలిపారు. గంపలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆట స్థలంలో ఈ నెల 19, 20, 21 తేదీల్లో పోటీలు జరుగుతాయన్నారు. తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కాగా పోటీల నిర్వహణలో భాగంగా గంపలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో క్రీడా ప్రాంగణంలో తగిన ఏర్పాట్లు కొనసాగిస్తున్నారు. ఏర్పాట్లను ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి, ఎంఈఓ పీడీఎల్ నరసింహారావు పరిశీలించారు.



గంపలగూడెం హైస్కూల్లో ఆట స్థలాన్ని సిద్ధం చేస్తున్న అధికారులు

వ్యాయామ ఉపాధ్యాయులు జి. గోపాలరావు, అంజయ్య, యాకూబ్, రాంబాబు, జయలక్ష్మి, రమాదేవి, రూతు ఆధ్వర్యంలో కొనసాగిస్తున్నారు.

సంక్షిప్త వార్తలు

కొత్త పింఛన్ల పంపిణీ

తిరువూరు: ఇటీవల ప్రభుత్వం మంజూరు చేసిన వైఎస్సార్ పింఛను కానుకను తిరువూరు 12వ వార్డులో శనివారం పంపిణీ చేశారు. వార్డు కౌన్సిలర్ గుమ్మా కోటేశ్వరి పాతతిరువూరు, పీటీకొత్తూరు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను అందజేశారు. ఇంకా అర్హులైన వారెవరైనా ఉంటే వలంటీర్లను సంప్రదించి, పెన్షనుకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాపారావు, సత్యనారాయణరెడ్డి, రంగారెడ్డి, ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆర్కే ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కే రామకృష్ణయ్య అన్నారు. కేతనకొండ ఆర్కే ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, రోటరీ క్లబ్ ఆఫ్ మ్యాంగో టౌన్ నూజివీడు వారి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం శనివారం నిర్వహించారు. రోటరీ సంస్థ 110మంది విద్యార్థుల నుంచి రక్తం సేకరించారు.

తల్లిపాలే తాగించాలి

గంపలగూడెం: పుట్టిన బిడ్డకు ఆరు నెలలు వచ్చే వరకు తల్లిపాలు తాగించాలే తప్ప డబ్బా పాలు పట్టవద్దని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మునిలక్ష్మీ తెలిపారు. పట్టణ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో శనివారం పౌష్టికాహారమాసోత్సవం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, ప్రవంతి, హసీనాబేగం, పద్మ, సునీత పాల్గొన్నారు.

మండపాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలి

నూజివీడు: మండలంలోని గ్రామాల్లో వినాయక చవితి సందర్భంగా మండపాల ఏర్పాటుకు పోలీస్‌స్టేషన్ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ స్పష్టం చేశారు. స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద శనివారం పలు గ్రామాల్లోని వినాయక మండపాల కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

శ్రీకృష్ణుడి ప్రతిమ ఊరేగింపు

నూజివీడు: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక రావిచర్ల కమిటీ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త రావిచర్లలో శ్రీకృష్ణ భగవానుడి ప్రతిమను వైభవంగా ఊరేగించారు.

ఓజోన్ పొర రంధ్రం ఏర్పడేందుకు మానవ చర్య కారణం

మైలవరం: ఓజోన్ పొర రంధ్రం ఏర్పడేందుకు మానవ చర్య కారణమని ప్రొఫెసర్ నరసింహ వరప్రసాద్ తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోటనీ విభాగం ఆధ్వర్యంలో ఓజోన్ పొరయే జీవితం అనే అంశంపై ఒక రోజు జాతీయ సెమినార్ శనివారం నిర్వహించారు. ప్రముఖ విషయ నిపుణుడు ప్రొఫెసర్ ఎస్ఎం కాసిం, ప్రొఫెసర్ డైజీరాణి బటిష్,కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి, కృష్ణ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ జ్ఞానమణి, రిజిస్ట్రార్ డాక్టర్ పీ వీర బ్రహ్మచారి ప్రసంగించారు.

నిమ్రాలో ఓజోన్ లేయర్ దినోత్సవం

జూపూడి(ఇబ్రహీంపట్నం): ప్రపంచ ఓజోన్ లేయర్ దినోత్సవం, ఇండియన్ ఆయిల్ డే ట్రీప్లాంటేషన్ పురస్కరించుకుని వనం మనంలో భాగంగా నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సీనియర్ మేనేజర్ డేవిడ్ అరోరా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ అక్బర్‌ఖాన్ పాల్గొన్నారు.

రెండో రోజు ఎమ్మార్పీఎస్ నిరసన దీక్ష

గంపలగూడెం: షెడ్యూల్ కులాల రిజర్వేషన్ వర్గీకరణకు ప్రత్యేక పార్లమెంటు సమావేశంలో చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ గంపలగూడెంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష రెండో రోజు శనివారం కొనసాగింది. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలు మరింతగా పెరుగుతాయి

నూజివీడు: సాఫ్ట్‌వేర్ రంగంలో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు పొందేందుకు స్టాటిస్టికల్ ఎనాలసిస్ సాఫ్ట్‌వేర్ ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మార్ అప్పారావు కాలేజీ ఆఫ్ పోస్టుగ్రాడ్యుయేషన్ కోర్సెస్ ప్రిన్సిపాల్ ఆచార్య ఎంటీ బసవేశ్వరరావు అన్నారు. స్థానిక పీజీ కళాశాలలో శనివారం స్టాటిస్టిక్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు, అధ్యాపకులకు స్టాటిస్టికల్ ఎనాలసిస్ సాఫ్ట్‌వేర్‌లో ఆన్‌లైన్ సెమినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా బసవేశ్వరరావు మాట్లాడుతూ ఈ సెమినార్‌ను నిర్వహించడం ద్వారా విద్యార్థులకు దీని పట్ల అవగాహన మరింత పెరుగుతుందన్నారు. దీనిని డైమెన్సొనాలిటీ సాఫ్ట్‌వేర్ సర్వీస్, ఆంధ్రప్రదేశ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అనుసంధానంతో నిర్వహించారు. ఈ సెమినార్‌లో 60మంది పాల్గొనగా వీరందరికీ ఈ సర్టిఫికెట్లను అందజేశారు. కోఆర్డినేట్ సీవీ శాస్త్రి, అధ్యాపకులు కే అవినాష్, డీ తేజశ్వేత పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభం



కొండపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష పథకంపై అవగాహన ర్యాలీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి ఆరోగ్య కేంద్రం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం డాక్టర్ వికాష్, వైఎస్సార్ సీపీ నాయకులు, వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. పథకం ద్వారా కుటుంబాల్లో కలిగే ఆరోగ్య ప్రయోజనం వివరించారు. కుటుంబాల్లోని దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి ఐడీ నంబర్ కేటాయించారు. ఈ నెల 30వ తేదీ నుంచి జరగనున్న మెడికల్ క్యాంపుల్లో ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైఎస్సార్ సీపీ టౌన్ అధ్యక్షుడు మిక్కిలి శరభయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కాండ్రకొండ గురవయ్య, వార్డు కౌన్సిర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య సంరక్షణే ధ్యేయం

తోలుకోడు(మైలవరం): ప్రజల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టిందని మైలవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. మైలవరం మండలం తోలుకోడులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శనివారం ప్రారంభించారు. ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి, చంద్రాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ నరేష్, డాక్టర్ ప్రియాంక ప్రసంగించారు. వైస్సార్ సీపీ నాయకులు స్థల దాత ఇనుగంటి చక్రధరరావు, మార్కెట్ యార్డు డైరెక్టర్ తోట తిరుపతిరావు, నాయకుడు ప్రతాప్, ఉప సర్పంచ్ ఇంకొల్లు చంటి, సచివాలయం కన్వీనర్ సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

నేడు స్వచ్ఛతాలీగ్ ర్యాలీ

తిరువూరు: తిరువూరు పట్టణాన్ని చెత్తరహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ఇండియన్ స్వచ్ఛతా లీగ్ 2.0 కార్యక్రమాన్ని ఆదివారం చేపడుతున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం, చెత్తను రోడ్లపైన పోయకుండా డంపింగ్ యార్డుకు తరలించే వాహనాలకు అప్పగించడం, బహిరంగ మలమూత్ర విసర్జన నిషేధం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆదివారం ఉదయం ఏడు గంటలకు చీరాల సెంటర్ నుంచి ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో పూరిల్లు దగ్ధం

మునునూరు: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా పూరిల్లు దగ్ధమవడంతో ఓ కుటుంబం కట్టుబట్టలతో మిగిలిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. వేల్పుచర్లలో గద్దం తిరుపతిరావుకు చెందిన పూరింట్లో శనివారం ఉదయం మంటలు చెలరేగాయి. కుటుంబ సభ్యులు తేరుకునేలోగానే మంటలు వ్యాపించి ఇంట్లోని వస్తువులను కాపాడుకోలేక, కట్టు బట్టలతో బయటకు పరుగులు తీశారు.

ఏలూరు నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి, మంటలను అదుపు చేశారు. రెవెన్యూ అధికారులు నష్టాన్ని అంచనా వేశారు. ఈ ఘటనలో ఇంట్లో ఉంచిన రూ.లక్షన్నర నగదు, విలువైన ఆభరణాలు, వస్తువులు, వంట సామగ్రి, పిల్లలకు చెందిన సర్టిఫికెట్లు, భూములకు సంబంధిత డాక్యుమెంట్లు దగ్ధమయ్యాయి. సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

మునునూరు: యువకుడు అదృశ్యంపై మునునూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై ఎం.కుటుంబరావు తెలిపిన వివరాల ప్రకారం చింతలవల్లికి చెందిన పల్లిపాము రవీంద్ర కుమార్ ఐటీఐ చదివి కేటరింగ్ పనులు చేస్తూ జీవనం గడుపుతున్నాడు. ఆగస్టు 12వ తేదీన ఇంటివద్ద నుంచి విజయవాడకు వెళ్లి అక్కడ ఉంటున్నాడు. ఈ నెల 14న రాత్రి ఎవరికీ చెప్పకుండా వెళ్లి తిరిగి రాలేదని అతడితో ఉంటున్న వారు తెలపడంతో బంధువులు ఆందోళన చెందారు. అతడి ఆచూకీ కోసం గాలించారు. అతని అక్క మల్లాది స్వాతి మునునూరు పోలీసులకు శనివారం రాత్రి ఫిర్యాదు చేసింది. ఆమె అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నవసమాజ దిశా నిర్దేశకులు ఉపాధ్యాయులు



హీల్ ప్యారడైజ్ స్కూల్‌కు చెక్కును అందజేస్తున్న శిక్షణ పొందిన ప్రధానోపాధ్యాయులు

నూజివీడు: మారుతున్న సమాజ పరిస్థితులకనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దే దిశా నిర్దేశకులు ఉపాధ్యాయులేనని హీల్ సంస్థ సీఈఓ కూరపాటి అజయ్ కుమార్ అన్నారు. ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోని హీల్ ప్యారడైజ్ స్కూల్లో ఆరు రోజులుగా నిర్వహిస్తున్న తొమ్మిదో బ్యాచ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు శిక్షణ తరగతుల ముగింపు సమావేశం శనివారం నిర్వహించారు. ఈ ఆరు రోజుల నాయకత్వ శిక్షణ శిబిరంలో ఏలూరు, కృష్ణ, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన 200 మంది ప్రధానోపాధ్యాయులకు స్వీయ క్రమశిక్షణ, అవగాహన, లక్ష్యాలను సాధించడంలో సామర్థ్యాలను పెంచుకోవడం, అభివృద్ధి మనస్తత్వాన్ని పెంచుకోవడం, అహింసాయుత సమాచారాన్ని ఉపయోగించి అభివృద్ధి భావాలను ప్రసారం చేయడం, అధికార రహిత ప్రభావాన్ని చూపించడం, పాఠశాల భద్రత తదితర అంశాలపై శిక్షణ పొందారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు హీల్ పాఠశాలకు రూ.1,87,560 విరాళంగా అందజేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో కోర్స్ ఇన్‌చార్జి, ఏలూరు జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ఏ భాస్కర్ కుమార్, సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకులు ఏ వీరభద్రరావు, కోర్స్ మాడ్యూల్ ఆర్గనైజేషన్ సభ్యులు నీలిమ పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన

మైలవరం: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని డీన్ అకాడమిక్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్(సీఎస్ఈ) విభాగం ఆధ్వర్యంలో అసోసియేషన్ ఆఫ్ కంప్యూటర్ మిషనరీ స్టూడెంట్ చాప్టర్‌ను శనివారం ప్రారంభించారు. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ సోనేట్ హాల్లో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు, డీన్ అకాడమిక్ డాక్టర్ ఎం. శ్రీనివాసరావు, సీఎస్‌ఈ విభాగాధిపతి డాక్టర్ డి. వీరయ్య పాల్గొన్నారు. డాక్టర్ వీరయ్య చాప్టర్ లోగోను ఆవిష్కరించారు.

ప్రకృతి హితమే పండగల పరమార్థం

ప్రకృతి హితమే పండగల పరమార్థం అని ప్రతి ఒక్కరూ మట్టి గణపతులకు వాడాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రకృతి క్లబ్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా మట్టి గణపతులను పంచి పర్యావరణ పరిరక్షణ దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ గణపతులను వాడాలని తెలిపారు. ప్రకృతి క్లబ్ కో-ఆర్డినేటర్లు డాక్టర్ షహీదా నిలోఫర్, డాక్టర్ వి.భాగ్యలక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బి.శివహరి ప్రసాద్, ఎస్. ఉమామహేశ్వరరెడ్డి, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ పవిత్ర పాల్గొన్నారు.

జీవన ఎరువులపై అవగాహన సదస్సు

రెడ్డిగూడెం: పత్తిలో గులాబీరంగు పురుగునివారణకు ఆచరించాల్సిన మార్గాలపై జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి సత్యవతి అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. మండలంలోని కుదప రైతు భరోసా కేంద్రంలో సత్యవతి మాట్లాడుతూ పంటలలో జీవన ఎరువులు అజటోబాక్టర్, అజోస్పైరిల్లం, ఫోస్ఫోబ్యాక్టర్ లాంటివి వాడటం వల్ల మొక్కలకు నత్రజని, భాస్వరం వంటి పోషకాలు అందుతాయన్నారు. రసాయనిక ఎరువులపై అయ్యే ఖర్చు తగ్గించుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా పత్తిలో గులాబీ రంగు కాయ తొలుచు పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలు ఎకరాకు నాలుగు పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రెంటపల్లి సురేష్, గ్రామ వ్యవసాయశాఖ సహాయకులు రాజు, కేశవ్ పాల్గొన్నారు.